

గురజాడ శోభా పేరిందేవి

# ఇది నిజంగా కథే

"వద్దు! వద్దు! నేనీ బాధ భరించలేను" గట్టిగా అరుస్తూ లేచి కూర్చున్నాడు వినయ్.

"పీడకల వచ్చిందా బాబూ?" జాలిగా అడిగాడు తండ్రి.

తండ్రి కళ్ళల్లోని జాలి కన్నీళ్ళు తెప్పించింది.

"దేని గురించి కల కన్నావు బాబూ?" అడిగాడు తండ్రి

'ఏమని చెప్తాడు? అసలే ముఖం పెట్టుకుని చెప్తాడు?' అందుకే "ఏమీలేదు నిద్రవస్తోంది" అంటూ వెనక్కివాలి ముసుగు పెట్టేసుకున్నాడు.

వెచ్చగా కన్నీళ్ళు వేదనని చాటుతూ జారిపడుతున్నాయి. 'ఈ కన్నీళ్ళ కడలి ఇక ఇంకదా?'

ఎంతో సేపయ్యాక ముసుగు తొలగించాడు వినయ్.

పగలంతా పనిలో అలసిపోయిన తండ్రి గాఢనిద్రలో ఉన్నా ముఖంలో నీలినీడలు కనపడుతూనే ఉన్నాయి. దానికి కారణం తనే?

గుండెల్లోంచి తన్నుకొస్తున్న దుఃఖాన్ని గొంతులోనే అదుముతూ పక్కగదిలోకి నడిచాడు వినయ్.

ఆ గదినిండా పరుచుకున్న చీకటి అతనికి తన గుండెలో చోటిచ్చింది. కిటికీలోంచి చూసాడు.

కాటుక డబ్బా వంచేసినట్టుంది చీకటి! కాదు... కాదు. తారు డబ్బా తన్నేసినట్టుంది. ఒక్క చుక్కయినా చిరునవ్వుతో చూడడం లేదు. చంద్రుడు పరే పత్తాలేడు. తనని చూసి కిసుక్కున నవ్వుతున్నట్లుగా తళుక్కుమని తప్పుకుంటున్నాయి మెరుపులు.

తను నల్లగా ఉంటాడు! నిజమే! కాని గ్రీక్ వాడిలాగ ఎంతో అందంగా ఉంటాయి కవళికలు అంటారు కదా! అయినా ఒక్క ఆడపిల్లకూడా ఆమోదముద్ర వేయలేదు.

ప్రతీ ఆడదాని ఎదుటికీ వచ్చి కూర్చోడం, వచ్చినవారి చూపులు, మాటలూ ఛెళ్ళు ఛెళ్ళున కొరడాలతో కొడుతున్నట్లుంటున్నా భరించడం ఎంత రంపపుకోత.

ఇలా 'ఎన్నాళ్ళు? ఏన్నేళ్ళు? కన్నీళ్ళు నిశ్శబ్దంగా కారిపోతున్నాయి.

వాన కూడా కురవసాగింది అతనికి తోడుగా నిలుస్తున్నట్టుగా.

ఇవాళ తను కన్నకల ఎంత భయంకరంగా ఉంది! తనని కట్టుకున్న స్త్రీ తన ఎదురుగానే వేరే వాడితో రమిస్తోంది. ఇదా అన్యాయం అని తనెంత అరచి గీపెట్టినా నిర్లక్ష్యంగా సిగరెట్ పుసి విదిల్చింది తప్ప జవాబివ్వలేదు. అప్పుడు తన కోపమంతా తన తోటి మగాడిమీదికి మళ్ళింది. ఆడదానికి ఏం చేసినా చెల్లుతుంది. కాని సాటి మగాడి కాపురంలో నిప్పులు పోయటానికి ఈ మగాడికి మనసెలా ఒప్పిందో! ఆ మాటే తను అడుగుతున్నా వినిపించుకోకుండా తనని భరించేదాని మీదకి జరిగాడు వాడు. అప్పుడు తనకి ఆగ్రహం అధికమై వాడి చెంపని పేల్చేసాడు. అంతే? తనని కట్టుకున్న స్త్రీ ఆ ఉంచుకున్న వాడెదురుగానే తన ఒళ్ళు హూనమయ్యేలా బాదేసింది. ఆ బాధ భరించలేక అరిచాడు. అరుస్తూనే లేచాడు.

ఎందుకొచ్చిన పెళ్ళి అనిపిస్తోంది పీడకల గుర్తొస్తే!

కాని పాడు పడతులు తనని అవివాహితుడిగా బ్రతకనిస్తారా! కాకులు పొడిచినట్టు పొడిచి పారేయరూ! గ్రద్దలు పీక్కుతిన్నట్టు పీక్కుని తినేయరూ!

మగవాడిగా పుట్టేకంటే మురికి కాలువలో పొర్లే పందిలా పుట్టడం మేలు. తోటి మగవారికి కట్నం పేచీ వచ్చి ఆగిపోతుంది. కాని తన విషయంలో మాత్రం రంగు అడ్డొస్తోంది. అతి సామాన్యంగా ఉండి కారు నలుపు లో ఉన్న ఆడవాళ్ళు కూడా తెల్లటివాళ్ళని కోరుకుంటారేమిటో!

తన ఆలోచనల తీరుకి నవ్వొచ్చింది వినయ్‌కి!

వాళ్ళు డబ్బు పెట్టి కొనుక్కుంటున్న వాళ్ళు! కనుక వస్తువులు నాణ్యత లేకుండా ఎలా కొంటారు? ఆలోచిస్తూ నిలబడిపోయాడు వినయ్.

**అందం, చదువు ఉన్నా కట్నం ఇస్తే కాని కన్నెరికం వదిలేదికాదు. లేకపోతే పెళ్ళే జరిగేది కాదు. పోనీ కట్నం భారీగా ఇస్తే పిల్ల సుఖపడుతుంది కదా అనుకుంటూ ఓ అయ్య చేతిలో పెట్టినా ఆ పిల్ల కష్టాలు తీరేవి కాదు.**

మరో ముప్పైమంది చూసి వెళ్ళారు వినయ్‌ని! కొందరు అయిష్టాన్ని అక్షర రూపంలో వెల్లడిచేస్తే, ఇంకొందరు ముఖాన్నే నచ్చలేదు అనేసారు. మరికొందరు ముఖకవళికలు ముటముటలద్వారా మాటని తెలిపారు.

అతనికి పెళ్ళిచేయాలన్న ఉద్దేశ్యంతో అమ్మా, అక్కయ్యా కాళ్ళరిగేలా వాళ్ళ ఇళ్ళచుట్టూ తిరిగారు. కాదనిపించుకున్నారు.

ఈ పరిస్థితుల్లో వాళ్ళ ఇద్దరి ఎదుటకి రావటానికి తను ఎంతో కుంచించుకు పోసాగాడు. కుమిలిపోయేవాడు.

కొంతమంది పెళ్ళికూతుళ్ళు పిల్లాడు నచ్చలేదు. 'చూస్తూ చూస్తూ పుచ్చొంకాయతో పచ్చడి చేసుకోలేముగా' అంటున్నారు.

తల్లికీ అక్కకీ తిక్కరేగసాగింది.

'వెధవ! వీడిలోనే ఏదో లోపం ఉంది. అందుకే ఇలా జరుగుతోంది. మా గుండెలమీది ఈ గాడిపొయ్యి ఎప్పటికి దిగుతుందో!' అనసాగారు.

ఇదంతా చూసి బెంగపెట్టుకున్నాడు వినయ్.

కళ్ళు గుంటలు పడ్డాయి. జుట్టుకుచ్చుల్లాగా ఊడిపోసాగింది. ఈ మాత్రంగా ఉంటేనే ఇలా ఉంది. ఇంక బట్టతల వస్తే తన బ్రతుకు బట్టబయలే అనుకుంటూ జాగ్రత్తలు తీసుకోసాగాడు. ఏమైతేనేం, పెళ్ళి కుదిరింది.

ఈ పరిస్థితిలో తాతయ్య బాంబు పేల్చాడు. పెళ్ళి కుదిర్తే వినయ్‌కి గుండు గీయిస్తానని మొక్కుకున్నాట్ట. పెళ్ళయ్యాక ఇద్దరూ వెళ్ళచ్చు తిరపతికి అన్నారంతా!

తల్లికి కట్నం ముట్టింది.

అక్కకి లాంఛనాలు ముట్టాయి.

వినయ్‌కి వివాహితుడన్న ముద్రపడింది.

భార్య అభ్యుదయ సంఘ మాటవిని తెగ గోలచేసింది. మొక్కు తీర్చకపోతే కాపురానికే ముప్పులని తాతయ్య అన్నమాట చెప్పాడు. తిట్లూ దెబ్బలూ తినిపించి ఒప్పుకుంది అభ్యుదయ.

మొక్కైతే చెల్లించుకున్నాడు కాని గుండుతో అతను పడిన తిప్పలు పగవాళ్ళక్కూడా వద్దు అనిపించేలా ఉన్నాయి.

రకరకాల మగాళ్ళతో వినయ్‌నిపోల్చి వెక్కిరించడమూ, బోడిగుండు మీద రెండు ఇచ్చుకోడమూ చేసింది.

జుట్టు పెరిగేదాకా గుమ్మం దిగనివ్వలేదు. ఎవరైనా



ఇంటికి వచ్చినా బయటికి రానివ్వలేదు. ఇంటెడు కిరీచేసి ఓ మూలపడి ఉండేవాడు.

తనేం ఉద్యోగం చేయాలనుకున్నాడా ఊళ్ళేలాలనుకున్నాడా!!

లేదే! ఇంట్లో చాకిరీచేసి ఓ మూలగా మిగి ఉండాలనుకున్నాడు. కాని తన భార్య తనని కన్నె చూడడంలేదు.

వేలేసి ముట్టుకోడంలేదు.

ఎంత అందంగా ముస్తాబైనా ఆమె ఎద తన ఎ స్పందించడంలేదు.

గుడ్లనీరు కుక్కుకోడం మినహా ఏమీ చేయలేకపోతున్నాడు. రోజురోజుకీ ఈ నిర్లక్ష్యం అధికమైపోసాగింది.

ఇక భరించలేక కాళ్ళమీదపడి బావురుమన్నాడు వినయ్.

అప్పుడు అభ్యుదయ చిరుగా నవ్వింది.

నవ్వు పెరిగింది. పెరుగుతూపోయింది.

కన్నీళ్ళు కారుతున్నా, కడుపు నొప్పెడుతున్నా వెక్కిళ్ళు కెంపు వన్నెకి తిరిగినా నవ్వుతూనే ఉంది. ఎంతో సేపయ్యాక గంభీరంగా మాట్లాడింది.

"వందల వత్సరాల క్రితం వనిత ఇంతకంటే ఎక్కువగా అవమానాలు పొందిందిరా!"

డబ్బుకు కన్నబిడ్డని అమ్ముకుని చేతులు దులుపుకునేవాడు తండ్రి. కాపురం చేసే వయసొచ్చేసరికల్లా కాటికి చేరుకునే వాడు కట్టుకున్నవాడు. ఆపైన సహగమనం తప్పనిసరి!

కాస్త కాలం మారింది. సహగమనం కూడదంది ప్రభుత్వం. అయితే మాత్రం అవస్థలు పోయాయా? కోర్కెలకీ కాలానికీ ముడిపెట్టి వైధవ్యం పొందిన పడతిని ఉపకారాలకు దూరం చేసారు. గుండు గొరిగించా రు. మల్లుపంచెలని కట్టించారు.

కాలం కాస్త కాళ్ళు ముందుకు జరిపింది.

ఈ పరిస్థితి మరీ అన్యాయం!

అందం, చదువు వున్నా కట్నం ఇస్తేకాని కన్నెరికం వదిలేదికాదు. లేకపోతే పెళ్ళే జరిగేది కాదు. పోనీ కట్నం భారీగా ఇస్తే పిల్ల సుఖపడుతుంది కదా అనుకుంటూ అప్పోసొప్పో చేసి ఓ అయ్య చేతిలో పెట్టినా అంతటితో ఆ పిల్లకి ఆమెని కన్నవారికి కష్టాలు తీరేవి కాదు.

బోలెడన్ని కోరేవారు. తీర్చకపోతే తిప్పలు తప్పేవికావా కొత్త పెళ్ళికూతురికి!

కోర్కెల వ్యామోహంలో ఆమె మీద కిరోసిన్‌పోసి

తగలబెట్టేవారు లేదా ఆమెనే ఆత్మహత్యకు పురికొల్పేవారు.

అంతకంటే బాధాకరంగా ఉందా ఇప్పటి మీ పరిస్థితి?

ఉందంటే సంతోషిస్తాను. లేదంటే ఆరోజు రావాలని మీ మగజాతింకా చిత్రవధ కావాలని కోరుకుంటాను'' అంది అభ్యుదయ ఆ గదిలోంచి వెళ్ళిపోతూ!

విఖ్యాత్‌కి పట్టుకుచ్చులాగ జుట్టు పెరిగింది.

నల్లటి ఒత్తయిన మీసకట్టు, అంతకంటే అందమైన తలకట్టు అతనికెన్నో అందాలనమర్చాయి.

అసలే పొడగరి! దానికితోడు భార్య కొనిచ్చిన బీటిల్స్ వేసుకుని రేమండ్స్ సూట్ తొడుక్కుని, షాంపూ చేసిన జుట్టు గాలికి ఎగుర్తుండగా భార్యతో కలిసి పార్టీకి వెళ్ళాడు.

అక్కడి అతివల కళ్ళు అతన్ని అంటుకుపోయాయి. కొన్ని జతల కళ్ళు కన్ను గీటితే, కొన్ని పెదవులు నాలుకలో తడిచేసుకున్నాయి.

బెదురుగా చూస్తూ భార్యకి దగ్గరగా జరిగాడు వినయ్.

అభ్యుదయ ఆనందానికి అంతులేదు. ప్రతీ ఆడపిల్లా కోరేది ఈ రకమైన అమాయకమైన, అందగాడైన మగాడ్నే.

కొన్నాళ్ళు బాగానే జరిగాయి. పగలంతా బండచాకిరీ చేసినా భార్యరాగానే షికార్లు సరదాగానే ఉన్నాయి. అలాగే జరిగిపోతే సమస్యేలేకపోను. కాని ఆ జీవితానికి ముగింపు వచ్చింది.

ఆ రోజు ఉదయం ఆఫీసుకు వెడుతూ ఇంటికి తాళం పెట్టి వెళ్ళింది. మళ్ళీ రాత్రెప్పుడో తిరిగి వచ్చి తీసింది. ఇక రోజూ అంతే!

కారణమడిగాడు వినయ్.

''పార్టీలో అందరికళ్ళూ నీ మీదే ఉండడంతో తీసుకెళ్ళడం మానేసాను. మగాడు తిరిగి చెడతాడు అన్న సామెత ఉండనే ఉందిగా! అదీగాక నాకు నీ శీలం మీద నమ్మకంపోతోందీమధ్య. కనక బోలెడు డబ్బు పోసి కొనుక్కున్న నిన్ను నా ఇంట్లో దాచుకుంటున్నాను. మోజొచ్చినపుడు ఉద్ధరిస్తుంటాను.

కుమిలి కుమిలి ఏడ్చాడు వినయ్. ఆడది ఎంత స్వార్థపరురాలు. అందమైన మొగుడు కావాలి. కాని ఆ అందం తనకే పరిమితం కావాలి. పరాయి చూపులు కూడా దాన్ని స్పృశించకూడదు.

రోజులు భారంగా గడుస్తున్నాయి వినయ్‌కి!

రాత్రానూ అతని పరిస్థితి దిగజారిపోతోంది.

తెల్లటి వాడే అందగాడు అనడమూ అలాంటివాడితోనే తిరగడమూ తన నలుపుని నిరసిస్తూ ఒళ్ళు హూనమయ్యేలాగ బాదేయడమూ చేస్తోంది అభ్యుదయ.

వినయ్ జీవితం ఇలా డల్‌గా సాగుతుండగా ఓరోజు దినపత్రికలో వార్త వచ్చింది. వినయ్ అనే యువకుడు కిరోసిన్ పోసుకుని తగలబడి చనిపోయాడు. ఇది హత్యగా అనుమానిస్తారు. అతని భార్యే ఇది చేయించిందని అనుకుంటున్నారు. కాని సాక్ష్యాధారాలేం లేక ఆత్మహత్యగా ధృవీకరించి కేసు కొట్టేసారు.

* * *

అంతదాకా గబగబా హిరణ్యకశిప్ ఆపేసాడు. ఒక్కకాగితాన్ని పరిశీలనగా చూసి స్నేహితుడి వైపుకు తిరిగాడు.

''పూర్తిగా చదువు'' త్వరపెట్టాడు కపిల్

''ఇంకా చదవడమా?'' నవ్వాడు హిరణ్యకశిప్. మరుక్షణంలో అతని చేతులు కాగితాలను చింపి పోగుచేసాయి. అగ్గిపుల్లతో అంటించాయి.

''ఏమిటాపని?'' గాభరాగా అడిగాడు కపిల్. తన కష్టం కాలిపోడం కథా రచయితగా అతనికి బాధని కలిగిస్తోంది.

''చాలా మంచిపని? ప్రతి మగాడూ మెచ్చుకునేపని?''

''ఎందుకు?''

''ఎందుకేమిటి నీముఖం! నువ్వురాసిన కథ ఇప్పుడిప్పుడే నిద్రలేస్తున్న నారులు నడుం బిగించి ముందుకురికేందుకు ప్రోత్సహిస్తున్నట్టుగా ఉంది. వారి ఆలోచనల్లోకి కూడా ఆ భావం రాకూడదు. అది మనకే మాత్రం మంచిది కాదు. అందుకే పూర్తిగా చేసాను.'' అన్నాడు హిరణ్యకశిప్.

''నేనేమైనా ఆడవాళ్ళమీద జాలితో రాసాననుకున్నావా? హాస్యపత్రికకి పంపడానికి రాసాను''

''హాస్యానికి కూడా ఈ రకమైన ప్లాట్ ఎంచుకోకు''

''ఇది నిజంగా కథే?'' అన్నాడు కొట్టి పారేస్తూ కపిల్. కాని ఎంతలేదన్నా హిరణ్యకశిప్ హెచ్చరికలో నిజం లేకపోలే దనిపించసాగిందతనికి!

అందుకే ఆ కాగితాలు తాలుకు బూడిదనైనా చూడలేనట్లు దాన్ని పోగుచేసి ఎత్తి పారేసే పనిలో పడ్డాడు కపిల్.

*


గృహిణుల
ఆదరాభిమానాలు అందుకొన్న
శాంత టిల్టింగ్ వెట్‌గ్రైండర్



santha



ధృఢమైన మోటారుతో పని చేస్తుంది.
నిశ్శబ్దమైన చలనం, 11-12 నిమిషాలలో పిండి
తయారీ, శుభ్రపరచడం ఎంతో తేలిక,
ఆకర్షణీయమైన రంగులతో 1 లీటరు,
1½ లీటరు, 2 లీటర్ల సైజులలో
అన్ని పట్టణములందు లభించును.

SUVARNA / PUSHPA

24 నెలల గ్యారెంటీ.. జీవితాంతం ఉచిత సర్వీసు!

* ప్రీతి ఎంపోరియమ్, PHONE: 64038
47-15-9, స్టేషన్ రోడ్, ద్వారకానగర్, వైజాగ్-16.
* మల్టి కమర్షియల్ ఎంటర్‌ప్రైజ్,
2-146/3, దుర్గామహాల్ ఎదురుగా, పటమట,
విజయవాడ-6. PHONE: 52521.

విడుదలైనది!

ప్రేమకోసం చేయిచాస్తే మోసం...
కపటం ఎదురైంది. జీవన సరళిలో
అనుభవాలగాయాలను సరించి
చెప్పే నవల....

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి

ఒంటరి నక్షత్రం
మొదటి భాగం
రూ. 20=00

ఒంటరి నక్షత్రం
రెండవ భాగం
రూ. 20=00

అన్ని పుస్తకాల షాపులలోను దొరుకుతాయి.
లేదా పుస్తకం ధరకు రూ. 3/- కలిపి M.O.
చేయండి. రిజిష్టరు పోస్టులో పంపుతాం.

HAREE

క్వాలిటీ పబ్లిషర్స్
రామమందిరం వీధి,
విజయవాడ-520002.